అయ్యప్ప సొసైటీలో అధ్వానం

- నివాసాలకు అనుగుణంగా లేని డ్రైనేజీ లైన్లు
- వీధుల్లోనే సీవరేజీ ప్రవాహం
- పాదచారులు, వాహనదారుల ఇబ్బందులు
- కొత్తలైన్లు నిర్మించాలని స్థానికుల డిమాండ్

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో హైటెక్ సిటీకి సమీపంలోని అయ్యప్ప సొసైటీ అధ్వానంగా మారింది. ఏ వీధి చూసినా మురుగు ప్రవాహమే కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళలో మూసీనదిలా సీవరేజీ నీరు వీధుల్లోనే పొంగిపొర్లుతోంది. ఇక వర్షాకాలం వస్తే 24 గంటల పాటు వీధులన్నీ మురుగునీటితో నిండి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో అయ్యప్పసొసైటీలోని ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. కనీసం వీధుల్లో నడువలేని పరిస్థితిని చూసి ఆవేదన చెందుతున్నారు. అయితే ఈ సొసైటీలో వెలిసిన భవనాలకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో నీటి కనెక్షన్లు లేవు. ఫలితంగా వాటర్ అండ్ సీవరేజీ బోర్డుకు ఆదాయం రాకపోవడంతో జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్ల సామర్థ్యాన్ని పెంచడం లేదు.

మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో స్థానికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయ్యప్ప సొసైటీలో నిర్మాణాలు చేపట్టే క్రమంలో ఎవరికి వారే డ్రైనేజీ, సీవరేజీ పైపులైన్లు వేసుకున్నారు. ఆ లైన్లే నేటికీ దిక్కయ్యాయి. ఆ సొసైటీలో వెలిసిన భవనాలకు, సీవరేజీ లైన్ల సామర్థ్యానికి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో మ్యాన్‌హోల్స్ పొంగి మురుగునీరు వీధులను ముంచెత్తుతోంది. అయ్యప్ప సొసైటీలో రోడ్డు నెం.47లో సీవరేజీ ఓవర్‌ఫ్లోతో కాలనీ మొత్తం మురుగు ప్రవహిస్తోంది. ఆ ప్రాంతంలోని వీధులన్నీ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. సీవరేజీ ఓవర్‌ఫ్లో అయిన సందర్భంలో వాటర్‌బోర్డుకు ఫిర్యాదు చేయగానే సిబ్బంది వచ్చి క్లీన్ చేసి వెళ్తున్నారు. కానీ రెండు రోజుల్లో పరిస్థితి యథావిధిగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు.







అయ్యప్ప సొసైటీలో ప్రస్తుతమున్న నివాస సామర్థ్యాలకు అనుగుణంగా సీవరేజీ లైన్లు వాటర్‌బోర్డు అధికారులు వేయడం లేదు. మురుగు పొంగి పొర్లితే ఎయిర్‌టెక్ మిషన్‌తో క్లీన్ చేస్తున్నారే తప్పా- శాశ్వత పరిష్కారం చూపడం లేదు. అయితే సొసైటీలో పాత సీవరేజీ లైన్ సామర్థ్యం ఏమాత్రం సరిపోవడం లేదని వాటర్‌బోర్డుకు, ఎమ్మెల్యేకు, మంత్రులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా సీవరేజీ లైన్లను పెంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే అయ్యప్ప సొసైటీలో సీవరేజీ బిల్లులు వేసి ఆదాయం పెంచుకునేందుకు వాటర్‌బోర్డు ప్రయత్నిస్తుందే తప్పా- పైపులైన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టకపోవడం కొసమెరుపు.

కొత్త లైన్లు నిర్మించాలంటున్న స్థానికులు

బిల్లులేసేందుకు సిద్ధమవుతున్న బోర్డు

ఆదాయం పెంచుకోవడానికి వాటర్‌బోర్డు ఇటీవల సరికొత్త పంథాను ఎంచుకుంది. సాధారణంగా నీటి బిల్లు చేసే క్రమంలో అదనంగా సీవరేజీ సెస్ వసూళ్లు చేస్తోంది. వాటర్‌బోర్డు నీటి కనెక్షన్ల నుంచి ఇదే తరహాలో బిల్లులు వసూళ్లు చేస్తోంది. అయితే నీటి కనెక్షన్ లేని నివాసాలు కూడా నగరంలో చాలా ఉన్నాయి. వాటి నుంచి సీవరేజీ సెస్ వసూలు చేయడానికి ప్రయోగాత్మకంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో వాటర్‌బోర్డు సర్వే చేసింది. చాలా వరకు అక్రమంగా భవనాలు నిర్మించి నల్లా కనెక్షన్ లేకుండా బోరునీటి మీద ఆధారపడుతున్నారని గుర్తించింది. ఆయా భవనాలు, ఇళ్ల సీవరేజీ కనెక్షన్లు వాటర్‌బోర్డు లైన్లకు అనధికారికంగా కలిపేశారు. దీంతో ఆయా భవనాల నుంచి సీవరేజీ బిల్లులు వసూలు చేసేందుకు వాటర్‌బోర్డు సిద్ధమవుతోంది. అయ్యప్ప సొసైటీలోని భవనాల నుంచి కూడా ఈ తరహా బిల్లులు వసూలు చేయడానికి చర్యలు చేపడుతోంది వాటర్‌బోర్డు.



కూకట్‌పల్లిలోని గార్బేజ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ అపూర్వ్ చౌహాన్, అధికారులు

కూకట్‌పల్లిలో జోనల్ కమిషనర్ పర్యటన

కూకట్‌పల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఇంటర్మీడియట్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను జోనల్‌కమిషనర్ అపూర్వ్ చౌహాన్ శనివారం తనిఖీ చేశారు. చెత్త సేకరణ, తరలింపు తదితర అంశాలను పరిశీలించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో సిమెంట్ ఫ్లోరింగ్ వేయాలంటూ రాంకీ సంస్థ నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి, ఉపకమిషనర్ రమేష్, అధికారులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మమత, సంధ్య, మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



రామ్‌చందర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాగరాజుతో ఏఐఏవైఎస్ సభ్యులు

ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

బాలానగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం (ఏఐఏవైఎస్) సభ్యులు శనివారం జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డెపల్లి రామ్‌చందర్‌ను మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌లో ఎస్సీ గెస్ట్‌హౌజ్‌లో బస చేసిన ఆయనను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బేగరి రాజు, కోశాధికారి బి.ప్రమోద్‌కుమార్, కార్యదర్శి అప్పలరాజు, భానుప్రకాష్, గ్రేటర్ కార్యదర్శులు వినయ్‌కుమార్, సదామహేష్, కమల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కూకట్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీకాలనీలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలోని విద్యార్థులకు పుసులూరి కాంచన శ్రీవల్లి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు టీవీఎస్ఎస్ ప్రసాద్, అద్దంకి అమరేశ్వరరావు, ఫణికుమార్, శ్రీనివాస్, నాగశ్రీనివాస్, నారాయణ, పాఠశాల నిర్వాహకులు నాగేశ్వరరావు, శిరీష్‌కుమార్, మధుసూదన్, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు తేవొద్దు



శ్రీశైలంగౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న వివిధ కాలనీల ప్రజలు

షాపూర్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా అధికారులు వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం వివిధ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు, కార్యకర్తలు షాపూర్‌నగర్‌లో ఆయన నివాసానికి వచ్చి సమస్యలు విన్నవించారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్‌గౌడ్, ఐలయ్య పాల్గొన్నారు.

బయోకెమికల్ కంపెనీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కేవీ విజయం



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మదన్‌గౌడ్

షాపూర్‌నగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఇండస్ట్రీయల్ ఏరియా లోని బయో కెమికల్ సింథటిక్ కంపెనీలో శనివారం జరిగిన యూనియన్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు ముద్దాపురం మదన్‌గౌడ్ ఐఎన్‌టీ యూసీ యూనియన్ అధ్యక్షుడు రాములునాయక్‌పై 23 ఓట్లు మెజార్టీతో గెలుపొందాడు. పరిశ్రమలో మొత్తం 61 మందికి ఓట్లు ఉండగా ఐఎన్‌టీయూసీకి 19 ఓట్లు రాగా, మదన్‌గౌడ్‌కు 42 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు తప్పనిసరిగా అండగా ఉండి కార్మికుల పక్షాన పోరాడుతానన్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరాలతో పేదలకు ప్రయోజనం

దుండిగల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ తండా-2లో ప్రజల సౌకర్యార్థం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ శంకర్‌నాయక్ ప్రారంభించారు. తండాలో ఉన్న అందరూ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని శంకర్‌నాయక్ కోరారు. ఈ శిబిరంలో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు పరీక్షలు చేయించుకోగా అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో మహిళా మండల నాయకురాలు శాంత, స్థానిక నాయకుడు రవీందర్ నాయక్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి పక్కన హెచ్‌ఎం అరుణ్‌జ్యోతి తదితరులు

ఉపాధ్యాయులు మార్గదర్శకులు

బాలానగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బాలానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఐదుగురు టీచర్ల వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను హెచ్‌ఎం అరుణ్‌జ్యోతితో కలిసి సత్కరించారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి కోసం స్కూల్ ఇన్‌చార్జిగా పని చేసిన శ్రీకాంత్ రెడ్డి సేవలు మరువలేనివని గుర్తు చేశారు.

కనకదుర్గమ్మ ఆలయంలో వారాహి నవరాత్రులు

నిజాంపేట్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి జరిగే ఆషాఢ మాస నవరాత్రుల్లో భాగం నిజాంపేట్‌లో ఉన్న కనకదుర్గమ్మ దేవాలయంలో ఆలయ ధర్మకర్త కొలన్ తేజా శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ఉత్సవాలను శనివారం ప్రారంభించారు. వారాహి అవతారంలో ఉన్నటువంటి అమ్మ వారు ప్రజలు సుఖశాంతులతో ఉండేలా చూడాలని ఆయన ప్రార్థించారు. అనంతరం అమ్మవారి మూలమంత్ర హోమం చేశారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సత్యనారాయణచార్యులు, గ్రామపెద్దలు కొలన్ నర్సింహారెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు.

మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటు కల్పించాలి

పంజాగుట్ట,జూలై 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపు సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులను తమ సామాజికవర్గానికి కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కోకాపేటలో ఆత్మగౌరవ భవానికి మరో రూ.20కోట్లను మంజూరు చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి రాజు, కార్యదర్శి వాసాల వెంకన్న, ఆర్వీ మహేందర్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షులు దేశెట్టి శివ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పేట్‌బషీరాబాద్, జూలై 6(ఆంధ్రజ్యోతి): శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా కొంపల్లి మున్సిపల్‌లోని ఎన్‌సీఎల్ నార్త్‌లోని కో-కన్వీనర్ శివాజీరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ బీజేపీ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి హాజరై శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కాలనీలో వారు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రకృతిని కాపాడకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజి రెడ్డి, గరిగే శేఖర్, కన్వీనర్ శేఖర్‌యాదవ్, గాజులరామారం కార్పొరేటర్‌రావుల శేషగిరి, ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి సతీష్ సాగర్ పలువురు పాల్గొన్నారు.

అల్లాపూర్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని అల్లాపూర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. వివేకానంద నగర్‌లోని స్వామి వివేకానంద కూడలిలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హైదర్‌నగర్: హైదర్‌నగర్ శాతవాహననగర్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మొక్కలు నాటుతున్న ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ బాలిరెడ్డినగర్‌లో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు నటరాజ్‌గౌడ్, రాజేశ్వరరావు, దుర్గారెడ్డి, లక్ష్మీ, సుజాత.

మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్

బాలానగర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): దేశ సమైఖ్యత, సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి డా. బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు అన్నారు. ఆయన చూపిన బాటలోనే యువత నడవాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు పుష్పారెడ్డి, నాయకులు సంజీవరావు, శ్రీకాంత్‌పటేల్‌గౌడ్, మట్టి ప్రసన్న, మధుమోహన్, రవి, కృష్ణ, అస్లాం, అరుణ్, భరత్, రాజు, సురేందర్, శివ, ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.



నర్సాపూర్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించిన నేతలు



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

- **హైదర్‌నగర్:** స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వంపై దేశ ప్రజలను చైతన్యం చేసిన మహానుభావుడు డాక్టర్‌బాబూ జగ్జీవన్‌రామ్ అని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, బాలస్వామి, అగ్రవాసు, మహేష్, జనార్దన్, శ్రీనివాస్, అజామ్, రాజు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయాలకు కూతవేటు దూరంలోని

నల్లపోచమ్మ ఆలయంలో చోరీ

జీడిమెట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఒక పక్క జీడిమెట్ల పోలీస్‌స్టేషన్, మరో పక్క డీసీపీ కార్యాలయం, దానిపక్కనే ఎస్ఓటీ ఆఫీసు, సమీపంలో సీసీఎస్‌లు ఉన్నాయి. వీటికి కూతవేటు దూరంలో జీడిమెట్ల ఈఎస్ఐ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న నల్లపోచమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి ఆలయం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఆలయంలోని హుండీని పగులగొట్టి దాదాపు సంవత్సరం పాటు నిల్వఉంచిన నగదును చోరీ చేశాడు. ఆషాఢమాసం కావడంతో ఉత్సవాలకు అమ్మవారిని సిద్ధం చేయడానికి ఆలయ నిర్వాహకులు శనివారం ఉదయం తలుపులు తీయడానికి రాగా హుండీ పగులగొట్టి ఉంది. అమ్మవారి వెండినగలు, నగదు దోచుకుపోయారని ఆలయ నిర్వాహకులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన పోలీసులు, క్లూస్‌టీంరం రంగంలోకి దిగి నిందితుడి వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లు సేకరించారు. ఈ దొంగతనం జరిగిన తీరంతా సీసీ కెమెరాలో రికార్డయింది. నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని జీడిమెట్ల పోలీసులు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేస్తున్నారు.



కోర్టు పోటీల్లో లా స్టూడెంట్స్

అనంత లా కాలేజీలో 'ఇంట్రామూట్ కోర్టు' పోటీలు

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని అనంత న్యాయ కళాశాలలో 3వ ఇంట్రా మూట్ కోర్టు పోటీలో నూతన చట్టాలు -భారత న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష అధిన్యం చట్టాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీకి ముఖ్య అతిథిగా ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి హాజరు కావటంతో పాటుగా న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. అత్యుత్తమ ప్రతిభ చాటిన విజేతలకు మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జీబీ రెడ్డి మాట్లాడుతూ నూతన.. చట్టాలపై ప్రజలలో అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ తరం న్యాయ విద్యార్థులకు, నేటి తరానికి న్యాయ వ్యవస్థపై మరింత అవగాహన పెంపొందించటానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగమన్నారు. అనంత న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమతి మాట్లాడుతూ.. మూడోసారి జరుపుతున్న ఈ పోటీలో విద్యార్థులే న్యాయవాదులుగా మారి వాదప్రతివాదనలు చేసి తమ ప్రతిభను చాటారన్నారు. ఈ పోటీలో అత్యున్నత ప్రదర్శన చేసిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు.

ఇద్దరు వ్యక్తుల అవయదానం

- పదమూడు మందిలో వెలుగులు
- గుండె, కాలేయం, లంగ్స్‌తో సహా ఇతర అవయవాల దానం

హైదరాబాద్ సిటీ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తుల అవయవదానంతో పదమూడు మందికి పునర్జన్మ లభించింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తుల బ్రెయిన్ డెడ్ కావడంతో వారి నుంచి సేకరించిన మూత్రపిండాలు, కాలేయం, గుండె, లంగ్స్, కార్నియా అవయవాలను సేకరించి అవసరమైన వారికి మార్పిడి చేశారు. వరంగల్‌కు చెందిన ల్యాబ్‌టెక్నీషియన్ సిరికొండ ప్రసాద్ (36) గత నెల 27న బైక్‌పై వెళుతుండగా కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించడంతో బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో అవయవదానానికి అంగీకరించారు. సిరికొండ ప్రసాద్ నుంచి అవయవాలను సేకరించారు.



సిరికొండ ప్రసాద్(ఫైల్)



టి.నర్సింగ్‌రావు (ఫైల్)

కాగా, ఈస్ట్‌మారేడ్‌పల్లికి చెందిన టి.నర్సింగ్‌రావు (39) గతనెల 28న ద్విచక్రవాహనంపై నుంచి కింద పడ్డారు. వెంటనే అతని ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు జరిపిస్తుండగా శుక్రవారం బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్స్ అవగాహన కల్పించడంతో అవయవదానానికి ముందుకు వచ్చారు. దీంతో ఇరువురి నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన 13మంది బాధితులకు అమర్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

విద్యతోనే సమాజాభివృద్ధి

పంజాగుట్ట, జూలై 6(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం కావాలని పలువురు వక్తలు అన్నారు. విద్యా సంక్షోభాన్ని సర్కార్ గుర్తించాలని, ఎక్కువ నిధులు కేటాయించి సంస్కరణలు తేవాలని, విద్యపై నిర్లక్ష్యంతో ఒక తరానికే అన్యాయం చేయకూడదని వారన్నారు. జవహర్ బాల్‌మంచ్(జేబీఎం)సంస్థ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న విద్యామిషన్ పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సంస్థ చైర్మన్ మామిడి రిషికేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, క్రాంతి తదితరులు హాజరై మాట్లాడారు. అత్యధిక యువత కలిగిన దేశాన్ని పటిష్టమైన దేశంగా మార్చాలంటే విద్యతోనే సాధ్యమని అన్నారు. విద్యారంగంపై లోతైన అధ్యయనం చేయడంతో పాటు ముఖ్యమంత్రి అధ్యక్షతన సమగ్ర సమీక్ష నిర్వహించాలని అన్నారు.

పత్రికా ప్రకటన

(1) ఏ ఎస్ మూర్తి లక్ష్మీనారాయణ R/o 8-22, మధుర నగర్, హైదరాబాద్ 38 (2) ఎం.వెంకట సూర్యనారాయణ రాజు S/o వెంకట సూర్యనారాయణ R/o H.No.281, జయప్రకాష్ నగర్, మియాపూర్, హైదరాబాద్.

నేను మా తండ్రిగారైన Late కె.ఎస్.మోహన్ రావు కలిసి 28-10-2006 సంవత్సరములో జోయినపల్లి సబ్ రిజిస్టర్ ఆఫిసు సికింద్రాబాద్‌లో మాకు సంబంధించిన స్థలము రసూలుపుర సికింద్రాబాద్ సర్వేనెంబర్ 75/2 లో ఉన్న 2001 చదరపు గజాలు డాక్యుమెంట్ నెంబర్ 2125/06 ద్వారా మీకు డెవలప్మెంట్ అగ్రిమెంటు చేసుకున్నాము. మీకు మేము డెవలప్మెంట్ అగ్రిమెంట్ ఇచ్చిన తరువాత మీరు అగ్రిమెంటు ప్రకారము ఎలాంటి నిర్మాణము చెపట్టనందున మేము మీరు చేసుకున్న డెవలప్మెంట్ అగ్రిమెంట్ నీ క్యాన్సిల్ చేసుకోవాలని నిర్ణయం తీసుకుని మీకు మూడు పర్యాయములు లెటర్ వ్రాసినాము. మీరు వాటిని స్వీకరించకపోవడం వలన తిరిగి మా అడ్రస్‌కి వచ్చినది అందువలన ఈ పత్రికా ప్రకటన ఇస్తున్నాము. మీరు ఈ ప్రకటన చూసిన వారం రోజుల లోపల క్రింద తెలపరచిన అడ్రస్‌కు సంప్రదించి డాక్యుమెంట్ క్యాన్సిలేషన్‌కి మాకు సహకరించవలసిందిగా కోరడమైనది. లేనిచో మేము తీసుకోబోయే న్యాయపరమైన చర్యలకు మీరే బాధ్యులు అవుతారు.

ఇట్లు...

కె.హిలికిరణ్ C/o శ్రీనివాసులు రెడ్డి

Cell:9704919144

కుత్బుల్లాపూర్‌లో అక్రమ నిర్మాణాలపై కొరడా

కుత్బుల్లాపూర్, జూలై 6(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో విచ్చలవిడిగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై జోనల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం కొరఢా ఝుళిపించారు. చింతల్‌లోని ప్రధాన రహదారి వెంబడి ఆగ్రోస్ పెట్రోల్ బంకు పక్కన కొందరు వ్యక్తులు నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవంలోని పైఅంతస్తును టాస్క్‌ఫోర్స్ అధికారులు గ్యాస్‌కట్టలతో స్లాబ్‌ను కూల్చేశారు. ఏసీపీ సాయిబాబా కూడా అధికారులతో ఉండి కూల్చివేతలు చేపట్టారు. బిల్డింగ్ యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో తూతూ మంత్రంగా కొంత మేర కూల్చేసి వెళ్లిపోయారు. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ కమిషనర్ వి.నర్సింహను వివరణ కోరగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 150 అక్రమనిర్మాణాలను గుర్తించామని, వాటికి నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్‌లు జారీ చేశామని, అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్‌లోని అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడినట్టు నిర్ధారణ అయితే తప్పకుండా చర్య లు తీసుకుంటామని తెలిపారు.



స్లాబ్‌ను కూల్చుతున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది